ప్రజాశక్తి

శనివారం 29 ఏప్రిల్ 2023 5

శ్రీ సత్యసాయి



13న లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి

మే 13న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరుతూ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్లు ఎమ్.గౌతమి, అరుణ్ బాబు, ఎస్పీలు కంచి శ్రీనివాసరావు, ఎస్‌వి.మాధవ్ రెడ్డి తదితరులతో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.శ్రీనివాస్ శుక్రవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అండర్ ట్రయల్స్‌గా ఉంటూ జైళ్లలో ఉంటున్న బాధితుల కేసులకు సంబంధించిన ఛార్జిషీటు త్వరగా ఫైల్ చేయాలని ఎస్పీలను కోరారు. ఈ సమావేశంలో అత్యాచారానికి గురైన ఓ బాధితురాలికి పరిహారంగా రూ.7 లక్షలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు.




పర్యాటక శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పర్యాటకం అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా పర్యటక రంగాన్ని బలోపేతం చేసి, మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు పర్యటక శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా టూరిజం అభివద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటక రంగం అభివద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. పర్యటకులు విశేషంగా రావడానికి కార్యచరణ ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. లేపాక్షి దగ్గర జటాయువు థీమ్ పార్క్ పచ్చదనంతో నింపాలని అధికారుల ఆదేశించారు. వీటితో పాటు వివిధ పర్యటక ప్రాంతాల్లో అతిథి గహాలు అసంపూర్తిగా ఉన్న భవనాలను నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలో జరిగే సమావేశాలకు ఆర్డీవోలు, పరిశ్రమల శాఖ జీఎం, కియా కంపెనీ ప్రతినిధులు సమావేశానికి హాజరై విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా టూరిజం అధికారిని నాగేశ్వర్ రెడ్డిని ఆదేశించారు. ఎన్‌పి కుంట మండలంలోని తిమ్మమ్మమర్రిమాను, చిలమత్తూర్ మండలంలోని వీరాపురం, రామగిరి మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈశ్వరయ్య, రీజనల్ టూరిజం డైరెక్టర్ రామచంద్ర, జిల్లా పర్యటకశాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి, డివిజనల్ మేనేజర్ చంద్రమౌళిరెడ్డి, మెంబర్లు గంగాధర్, మల్లికార్జున, పద్మనాభం, జ్యోతి కేశవ, డిఇ మీనాక్షి, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి, సంబంధిత శాఖఅధికారులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారంలో వేగం పెరగాలి

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారుల వేగం మరింత పెరగాలని కలెక్టర్ అరుణ్‌కుమార్ జిల్లా అధికారులకు సూచించారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్ జిల్లా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 9న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించనున్న "జగనన్నకు చెబుదాం.." కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా.. ఏకకాల సమయంలోనే... ప్రజల నుంచి వినతిని స్వీకరించడం, అందుకు సంబంధించిన ఆమోదయోగ్యమైన అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలో, సీఎంవో స్థాయి నుంచి నేరుగా సచివాలయాల పరిధిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. కావున అధికారులు అందరూ బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్, డీఆర్వో కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



లైబ్రరీ బ్లాక్ ప్రారంభోత్సవంలో కియా ప్రతినిధులు, విద్యార్థులు

డిగ్రీ కళాశాలలో కియా లైబ్రరీ బ్లాక్ ప్రారంభం

హాజరైన కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కియా లైబ్రరీ లర్నింగ్ హబ్‌గా ఉపయోగపడుతుందని కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కియా లైబ్రరీ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్.రమేష్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథి కబ్డాంగ్ లీ మాట్లాడారు. పెనుకొండ పరిసర ప్రాంతాల్లో విద్యారంగంలో కొత్త అధ్యాయాన్ని నెలకొల్పుతూ కియా లైబ్రరీ బ్లాక్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాలలో చదువుతున్న పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, కొత్తచెరువు మండలాల్లోని 83 గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా కియా పొరుగు ప్రాంతాలను మెరుగుపరచడంలో మా అంకితభావానికి కియా లైబ్రరీ బ్లాక్ నిదర్శనం అన్నారు. సమాజానికి అన్ని విధాలుగా సహాయం చేయడానికి సిఎస్ఆర్ కార్యకలాపాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో కియా లైబ్రరీ బ్లాక్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ డిజిటల్ లైబ్రరీ ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కియా ఇండియా ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు ప్రతాప్ చౌదరి, రంగనాయకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి, తిమ్మాపురం, ఇస్లాపురం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రశాంతి నిలయం వైద్య నిపుణులు పి.గుణరంజన్, శ్రీసాయి స్వరూప్ దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డిపల్లి పాఠశాలలో 27 మందికి, తిమ్మాపురం స్కూల్‌లో 15, ఇస్లాపురం స్కూల్‌లో 28 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారికి టోకెన్లు ఇచ్చి ఆదివారం ఇస్లాపురంలో నిర్వహించే వైద్య శిబిరంలో చికిత్స చేయించుకునేందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.


ఘనంగా రాఘవేంద్ర పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం 18వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్సై శ్రీధర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంగారెడ్డి, శ్రీశైలం ప్రవీణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రాథమిక దశలో పిల్లలకు మంచి విద్యా బుద్ధులు నేర్పించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, యాజమాన్యంపై ఉందన్నారు. పిల్లలు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శింగనమలలో పొలిటికల్ హీట్..!





◆ అటు టిడిపి... ఇటు వైసిపిలో ఆధిపత్య పోరు

◆ నేతల మధ్య కుదరని సఖ్యత

◆ చాపకింద నీరులా విస్తరిస్తున్న నేతల వైరం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పుడు శింగనమల నియోజకవర్గం రాజకీయ వేడిని రాజేస్తోంది. అటు ప్రతిపక్ష టిడిపిలో అంతర్గత కుమ్ములాటలు కొనసాగుతుండగా, ఇటు అధికార వైసిపిలోనూ గ్రపు తగాదాలు తారా స్థాయిలోనే నడుస్తున్నాయి. రెండు పార్టీల్లోనూ అంతర్గతపోరుకు కేంద్రంగా ఈ నియోజకవర్గం మారింది. మొన్నటి వరకు ప్రతిపక్ష టిడిపిలో ఎక్కువగా అసమ్మతి కనిపించేది. ప్రస్తుతం ఇది వైసిపికి పాకింది. బుధవారం నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన తరువాత అధికార పార్టీలో ఒక్కొక్కటిగా అసమ్మతి రాగాలు బయటకు వస్తున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల ఎస్సీ రిజర్వు నియోజక వర్గంగా ఉన్నప్పటికీ ఒక బలమైన సామాజికవర్గ అధిపత్యం ఈ నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తుంది. ముందు నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ అదే తీరున రాజకీయాలుంటాయి. ప్రజాప్రతినిధిగా ఎస్సీ సామాజిక తరగతికి చెందిన వారున్నప్పటికీ ఆయా మండలాలు, గ్రామాల్లో పెత్తందారులదే పైచేయిగా ఉంటుంది. వారి కనుసన్నల్లోనే అక్కడి రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. కాదంటే సదరు ప్రజాప్రతినిధికి సైతం తిప్పలు తప్పవు. ఈ క్రమంలో ఇప్పుడు ఎన్నికలు సమీస్తుండటంతో ఆయా పార్టీల్లో గ్రూపు తగాదాలు తీవ్ర స్థాయికే చేరుతుండటం గమనార్హం.

వైసిపిలో భగ్గుమంటున్న విభేదాలు

వైసిపిలో గ్రూపు తగాదాలు భగ్గుమంటున్నాయి. ఈ నియోజకవర్గంలో యల్లనూరు, పుట్లూరు మండలాలు ఫ్యాక్షన్ ప్రాంతాలుగా ప్రసిద్ధి చెందాయి. ఇక్కడి గ్రూపులకు ప్రాతినిధ్యం వహించే నాయకులు ఏ పార్టీలో ఉన్నా ఈ గ్రూపు తగాదాలు మాత్రం కొనసాగుతూనే ఉంటాయి. గతంలో కాంగ్రెసు పార్టీ ఉన్న సమయంలోనైనా ఇప్పుడు వైసిపిలోకి ఆ నాయకులొచ్చినా ఇదే తీరు కొనసాగుతోంది. యల్లనూరు మండలంలో శుక్రవారం నాడు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మరోవైపు వైసిపి నాయకులైన భోగాతి నారాయణరెడ్డి గ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. తమ మద్దతుదారులను అన్యాయం చేస్తున్నారంటూ తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి పోలీసు స్టేషన్ వద్ద నిరసనకు దిగడం గమనార్హం. భోగాతి నారాయణరెడ్డికి ముఖ్యమంత్రి సలహాదారుగానున్న ఆలూరు సాంబశివారెడ్డి ముందు నుంచి మద్దతునిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. దీంతో అటు సాంబశివారెడ్డి, ఇటు కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య కూడా సఖ్యతలేదు. ఈ లేమి కారణంగానే అనంతపురం జిల్లాలోని నార్పలలో జరిగిన ముఖ్యమంత్రి పర్యటనకు సైతం పెద్దారెడ్డి హాజరవన్నట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి విమానాశ్రయంలో పెద్దారెడ్డి ముఖ్యమంత్రిని కలిసారు. కాని ఇక్కడ మాత్రం కార్యక్రమానికి హాజరవలేదు. ఈ విభేదాల కారణంగానే హాజరవనట్టు ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి పర్యటన ముగియకముందే చామలూరు రాజగోపాల్ ఎస్సీ సెల్ నాయకులు కూడా సాంబశివారెడ్డికి వ్యతిరేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎస్సీ సామాజికవర్గం నుంచి ఎదుగుతున్న తనను తొక్కేస్తున్నారని ఆరోపించారు. ఈ రకంగా అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ పెరుగుతూ పోతున్నాయి.

టిడిపిలోనూ ఇదే తీరు...

శింగనమల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలోనూ ఇదే రకమైన గ్రూపు తగాదాలు కొనసాగుతున్నాయి. ఈ గ్రూపు తగాదాలు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పర్యటన సమయంలోనూ స్పష్టంగా కనిపించాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బండారు శ్రావణి సమన్వయం చేయలేకున్నారని టుమెన్ కమిటీ పేరుతో ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడును ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ కమిటీకి, శ్రావణికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. పై ఇద్దరు ఓసి సామాజిక తరగతి కావడంతో ఇద్దరిలో ఎవరూ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వీల్లేని పరిస్థితి ఉంది. దీంతో ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో ఎవరైతే మెరుగన్న దిశగా ఆ పార్టీ ఆలోచిస్తోంది. ముఖ్య నేతలు కూడా బలమైన వారిని ఈ నియోజకవర్గం బరిలో దింపేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్‌ను మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి బుధవారం నాడు కలిసి మాట్లాడుకోవడం పెద్ద చర్చనీయాంశమే అయింది. ఇలా రెండు పార్టీల్లోనూ అంతర్గత పోరు తీవ్ర స్థాయిలో నడుస్తుండటం ఆ నియోజకవర్గంలో రాజకీయ వేడిని పెంచుతున్నాయి.

సిఎస్‌డిటిలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్



సిఎస్‌డిటిలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సిఎస్‌డిటిలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం పుట్టపర్తి కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పలు సివిల్ సప్లయిస్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సిఎస్‌డిటిలు క్షేత్రస్థాయిలో పర్యటించి వారి పరిధిలోని ఎఫ్‌పి షాపులు, ఎండియు వాహనాలు, పెట్రోల్ బంకులు, గ్యాస్, సిలిండర్ గోడౌన్లు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. తనిఖీలకు సంబంధించిన రిపోర్ట్‌లను ప్రొఫార్మా ప్రకారం ప్రతి ఒక్కటీ ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ఏ పాఠశాలను, ఏ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు అనేది పూర్తి వివరాలతో అందజేయాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తనిఖీలు నిర్వహించి పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో అన్ని విషయాలను గమనించాలని తెలిపారు. రాగిజావా సక్రమంగా ఇస్తున్నారా, టేక్ హోమ్ రేషన్ సివిల్ సప్లై శాఖ నుంచి అన్ని సరిగా వెళ్తున్నాయా లేదా అనేది పరిశీలించాలన్నారు. పాఠశాలలకు సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను ఎలా వండాలో తెలియజేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఎండియు వాహన ఆపరేటర్ల ఖాళీలను నియమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యావసర సరుకులను కార్డుదారుల వద్దకు వెళ్లి అందించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఓ సింధు, డిఎంఒ అశ్వర్థ నారాయణ నాయక్, సిఎస్‌డిటిలు పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-హిందూపురం


అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకుని మే 1వ తేదీ నిర్వహించే కార్మిక దినోత్సవంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మే 1న నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. కార్మికులందరూ వారు విధులు నిర్వహిస్తున్న కార్యాలయాలు, పరిశ్రమల్లో జెండా ఆవిష్కరించాలన్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఇందిరా పార్కు వద్దకు రావాలన్నారు. అక్కడి నుంచి కార్మికులందరూ భారీ ప్రదర్శనగా గాంధీ సర్కిల్, చిన్న మార్కెట్, బెంగళూరు రోడ్డు, కేఎల్ రోడ్డు మీదుగా అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడ బహిరంగ ఏర్పాటు ఉంటుందని అందులో జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి నరసింహప్ప, అధ్యక్షుడు జగదీష్, కోశాధికారి రామకృష్ణ, ఫ్రీ కాట్ ట్రెజరర్ నందీష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-సోమందేపల్లి



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

ధర్మవరం మండల పరిధిలోని తుంపర్తి గ్రామంలో చేసిన భూసేకరణలో టిడిపి హయాంలోనే రైతులకు మోసం జరిగిందని పెనుగొండ ఎమ్మెల్యే శంకర నారాయణ పేర్కొన్నారు. సోమందేపల్లి మండల పరిధిలోని మంచేపల్లి, హుస్సేన్‌పురం గ్రామాల్లో శుక్రవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యేను జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రిని రైతులు అడ్డుకోవడాన్ని పాత్రికేయులు ప్రస్తావించగా ఎమ్మెల్యే స్పందించారు. సీఎం జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని చంద్రబాబు, లోకేష్ పచ్చ బ్యాచ్‌ను పంపించి అడ్డుకోవడానికి ప్రయత్నం చేశారని, అది విఫలం కావడంతో వారి పచ్చ మీడియాలో అపోహలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయాన్ని అడ్డుకోలేరన్నారు. అనంతరం అధికారులతో కలిసి గ్రామాల్లోని గడప గడపకూ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారికి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ, జడ్పిటిసి డిసి అశోక్, స్థానిక సర్పంచి ఎర్రమ్మ, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మేజర్ పంచాయతీ ఉపసర్పంచి వేణు, సర్పంచిలు సోమశేఖర్, రామాంజనేయులు, పరంధామ, లలిత, లక్ష్మీ నరసప్ప, సింగిల్‌విండో ఛైర్మన్ కొల్లప్ప, వెంకటరత్నం, గజేంద్ర, అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న మౌనిక(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఇంటర్ పరీక్షల్లో తప్పానన్న మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఒంటిమిద్ది గ్రామానికి చెందిన సునీత, వెంకటరెడ్డి దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. వీరిలో మౌనిక(17) పెద్దకూతురు. ఈమె అనంతపురం నారాయణ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం నాడు వెలువడిన ఫలితాల్లో గణితం సబ్జెక్టు ఈ విద్యార్థి ఫెయిల్ అయ్యింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి లోనైంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో పాటు భోజనం చేసింది. అనంతరం నిద్రించేందుకు తన గదిలోకి వెళ్లింది. కొద్దిసేపటికే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఉదయం ఎంతసేపటికీ కుమార్తె గది నుంచి బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు లోపలికెళ్లి చూశారు. అప్పటికే కుమార్తె మంచంపై విగతజీవిగా కన్పించింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తేజమూర్తి తెలిపారు.

సర్వేయర్ ఆత్మహత్యాయత్నం

పెనుకొండ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని ఆర్ఐ గది వెనుక శెట్టిపల్లి గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న భరద్వాజ్ పెయిన్ కిల్లర్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సర్వేయర్‌ను వెంటనే రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సర్వేయర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉపాధి హామీ పనుల పరిశీలన

రొద్దం : మండల పరిధిలోని చిన్నమంతూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరు, పనుల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం పంపిణీ, తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

'ఆర్థిక అక్షరాస్యత-సాంఘిక భద్రత'పై అవగాహన

సోమందేపల్లి : ఆర్థిక అక్షరాస్యత, సాంఘిక భద్రత పథకాలపై శుక్రవారం స్థానిక కెనరా బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో సరస్వతి మండల సమాఖ్య సహకారంతో స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిజర్వు బ్యాంక్ ఏజీఎం అనిల్ కుమార్, సత్య సాయి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయినాథ్ రెడ్డి, స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, కెనరా బ్యాంక్ విశ్రాంత మేనేజర్ కష్ణమూర్తి, వెలుగు ఎపిఎం రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాజాతా కళాకారుల బందం ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి పథకం, పొదుపు ఆవశ్యకతపై నాటిక రూపంలో వివరించారు.

సచివాలయ మహిళా పోలీసులతో రక్షణ

పుట్టపర్తి రూరల్ : గ్రామీణ ,పట్టణ ప్రాంతాలలో మహిళల రక్షణ కోసమే గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీసులను నియమించామని పోలీసు యంత్రాంగంలో వీరు భాగస్వామిలేనని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్.హెచ్.ఒల అధ్యర్యంలో ఆయా స్టేషన్ పరిధిలోని సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు, సిబ్బంది తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొదటి సారిగా శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మహిళ పోలీసులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళల రక్షణ కోసం ప్రతి సచివాలయం పరిధిలో ఒక మహిళ పోలీసును నియమించిందన్నారు. వారు కూడా పోలీస్ వ్యవస్థలో ఒక భాగమని, కావున ప్రతి ఒక మహిళ పోలీసు తమ సచివాలయ పరిధిలోని మహిళలతో క్రమం తప్పకుండా మమేకమౌతూ, తద్వారా వారి యొక్క సమస్యలను తెలుసుకుంటూ వాటిని పై అధికారుల సహాయంతో పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలలో వరకట్న వేధింపులు, బాల్యవివాహాలు, కుటుంబ తగాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి స్త్రీ కి దిశ యాప్ గురించి అవగాహన పెంచాలని, తమ పరిధిలోని పాఠశాలలను క్రమంగా సందర్శిస్తూ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై అవగాహన పెంచాలన్నారు. కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసులను జిల్లా ఎస్పీ ఈసందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు జిల్లా అదనపు ఎస్పీ కెవి రామకృష్ణ ప్రసాద్, దిశ సిఐ లక్ష్మన్, విసిఆర్బి సిఐ సుబ్బారాయ్ తదితరులు పాల్గొన్నారు.


నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నీసా సాధిక్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - నల్లచెరువు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం గృహాలు నిర్మించి ఇవ్వాలని రైతుసంఘం జిల్లా నాయకులు బడా సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్లను సిపిఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలోపాదయాత్ర చేస్తూ అనేకమైన హామీలను ఇచ్చారని వాటిలో ఒకటి పేద ప్రజలందరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారని అన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా కనీసం ఒక్క ఇంటి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. మండల వ్యాప్తంగా ఎంతో మంది నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో కాపురాలు వెళ్లదీస్తున్నారని అన్నారు. పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ మోహన్ రెడ్డిని నమ్మి ఓట్లు వేసినందుకు తగిన శాస్తి జరిగిందని బాధపడుతున్నారని అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పేద ప్రజలందరినీ కూడగట్టి ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేశామని అన్నారు. ప్రస్తుతం పాలకులు మండల వ్యాప్తంగా అక్కడక్కడ అనువు గాని చోట లేఅవుట్లు ఏర్పాటుచేసి తాము ఏదో సాధించామని గొప్పగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. అందరికీ ఆమోదయోగ్యమైన మండల కేంద్రం సమీపంలో కే. పూలకుంట రోడ్డు ప్రక్కన 7.13 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తాము గత సంవత్సరంలో కోరామని అన్నారు. అయితే ఇప్పటివరకు రెవెన్యూ అధికారుల నుండి ఎటువంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు కళ్లు తెరిచి నిజమైన పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పేదలతో కలిసి నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీరాములు, సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం బావయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పట్టపగలే చోరీ

హిందూపురం : హిందూపురం పట్టణంలో పట్టపగలే దొంగలు సినీ ఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో వ్యాపారి రామక్రిష్టప్ప ద్విచక్ర వాహనంలో నుంచి రూ.6లక్షలు ఎత్తుకెళ్లారు. అందుకు సంబంధించిన వివరాలు... పట్టణంలోని ముదిరెడ్డిపల్లిలో నివాసం ఉంటున్న చీరల వ్యాపారి రామక్రిష్టప్ప బిఎస్ఎన్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న సిటీ యూనియన్ బ్యాంక్ నుంచి రూ.6లక్షలు డ్రా చేసుకుని ద్విచక్ర వాహనంలో సీటు కింద పెట్టుకుని ఇంటికి వెళుతున్నారు. మార్గ మధ్యలో అజంత లాడ్జ్ వద్ద మిత్రుడు కనిపించడంతో టీ తాగడానికి వాహనం ఆపి అక్కడికి వెళ్లాడు. అప్పటికే ఆతడిని గమనిస్తున్న దుండగులు వాహనం ఆపిన వెంటనే సీటు కింద ఉన్న రూ.6లక్షల నగదును తీసుకుని మరో ద్విచక్ర వాహనంలో పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన బాధితులు ఆ దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించగా సాధ్యం కాలేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలోనే దొంగలు క్షణాల్లో రూ.6లక్షలు దొంగలించిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. ఈ సంఘటనపై పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. దొంగతనం చేసిన దృశ్యాలు సిసి ఫుటేజీలో రికార్డు అయ్యాయి. వాటిని పోలీసులు పరిశీలించారు. చీరల వ్యాపారి రామక్రిష్టప్ప తన వద్ద పనిచేస్తున్న మగ్గాల కార్మికులకు బట్వాడ ఇచ్చేందుకు ఈ సొమ్మును డ్రా చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు 44 వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందారు. పలువురు గాయాలపాలయ్యారు. అందుకు సంబంధించిన వివరాలు... బెంగళూరు వైపు నుండి వస్తున్న ఐచర్ వాహనం అదుపుతప్పి డివైడర్ పై దూసుకెళ్లి అనంతపురం నుండి బెంగళూరు వెళ్తున్న కెఎస్ఆర్‌టిసి బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో నార్పల మండలం సిద్దలాచర్ల పల్లికి చెందిన హైచర్ డ్రైవర్ వెంకటరాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో ఉన్న కొంత మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి పరిశీలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



విరాళం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : గాండ్లపెంట మండలం వేపరాల గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారాముల దేవాలయ అభివృద్ధికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ తనవంతు విరాళం అందజేశారు. రామాలయ నిర్మాణానికి సహకారం అందించాలని గ్రామస్తులు కోరగా స్పందించిన ఆయన 25వేలను అందజేశారు. బూసిరెడ్డి వెంకటరెడ్డి, జయచంద్రారెడ్డి, ఆనంద్ రెడ్డి, గంగిశెట్టి, నాగరాజు, రామచంద్ర తదితరులకు అందజేశారు ఈ కార్యక్రమంలో కదిరి రూరల్ మండలం వైస్ ఎంపీపీ బత్తల ఆదినారాయణ, కదిరి పట్టణ అధ్యక్షులు బహువుద్దీన్, వైసిపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, వడ్డెర నాయకులు సంపంగి గోవర్ధన్, వైఎస్ఆర్‌సిపి విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి వంకధార రాఘవేంద్ర, నాయకులు రామచంద్ర, బత్తల యువజన సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆలోచనా విధానం అద్భుతం



అలీషా జాస్మీన్ సిద్ధం చేసిన ప్రాజెక్టును పాఠశాలకు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని తన తోటి విద్యార్థులు సమగ్రంగా అర్థం చేసుకోవాలని సంకల్పించి, పాఠశాల పూర్వ విద్యార్థి ఆలిషా జాస్మిన్ చేసిన ఆలోచన విధానం అద్భుతమైనదని అల్ హిలాల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్బర్ షరీఫ్ పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి అలీషా జాస్మిన్ కృష్ణాజిల్లా నందిగామలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ విద్యలో ఇంజనీరింగ్ చదువుతోంది. తాను విద్యనభ్యసిస్తూ తోటి విద్యార్థులకు తనవంతుగా ఏదో ఒక సహాయం చేయాలని సంకల్పించింది. 1975లో భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఉపయోగించిన ఆర్యభట్ శాటిలైట్ నుంచి ఇప్పటి వరకు ఎన్ని శాటిలైట్లు ప్రయోగించారు, వాటి పనితీరును వివరిస్తూ చార్టులను, ప్రయోగించిన రాకెట్ల శాటిలైట్లను తయారు చేసి తన తల్లి సల్మా భానుతో పాటు తనకు ట్యూషన్ చెప్పిన మాస్టర్ రాజు, రంజిత్, కృష్ణల చేతుల మీదుగా పాఠశాలకు శుక్రవారం అందించింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అక్బర్ షరీఫ్ మాట్లాడుతు ప్రతి సంవత్సరం పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది తమ విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళుతుంటారన్నారు. అందులో కొంతమంది మాత్రమే చదివిన పాఠశాలకు, విద్యార్థులకు చేయూతనివ్వాలని అనుకుంటారని అన్నారు. అలీషా జాస్మిన్ చదివిన పాఠశాలకు, విద్యార్థులకు తన వంతుగా ఏదో చేయాలని సంకల్పించి పరీక్షల సమయంలో సైతం తన చదువును చదువుకుంటూ, పాఠశాలకు కొంత సమయాన్ని కేటాయించి భారతదేశంలో ఇప్పటి వరకు ఏ సందర్భాల్లో ఏ ఏ శాటిలైట్లు ఉపయోగించారు, వాటి పనితీరును ఆంగ్లం, హిందీ భాషలో వివరిస్తూ ప్రాజెక్టులను సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. వాటిని తన తల్లి సల్మా భాను, చదువు చెప్పిన గురువుల చేతుల మీదుగా పాఠశాలకు అందివ్వడం గొప్ప విషయమన్నారు. ప్రతి విద్యార్థి అలీషా జాస్మిన్ ను ఆదర్శంగా తీసుకొని చదువుకున్న పాఠశాలకు చేయూతనివ్వడానికి ముందుకు రావడంతో పాటు బాగా చదువుకొని తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు, చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫౌజియా, షబీనా, లక్ష్మీకాంత్, పాఠశాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన బాలికలకు హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ కోర్సులో ప్రాథమిక శిక్షణ, కమ్యూనికేటివ్ స్కిల్స్, ఇంగ్లీషు గ్రామర్, గణితంలో మెళకువలు మొదలైన అంశాలలో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్ పాసైన అమ్మాయిల కోసం తమ కళాశాలలో వివిధ కోర్సులు నిర్వహిస్తున్నామని, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించి, విద్యార్థినులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. మే నెల 1 వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ శిక్షణ వుంటుందని, విద్యార్థినులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. పూర్తి వివరాలకు 9866876245, 6303432820 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబు చెల్లని రాజకీయవేత్త : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



జెండా ఊపి రీసర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రస్తుత రాజకీయాల్లో చంద్రబాబు చెల్లని రాజకీయవేత్త అని పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం పట్టణ సమీపంలోని కర్నాటక నాగేపల్లి వద్ద భూ రక్ష, శాశ్వత భూహక్కు రీ సర్వే రెండవ విడత ప్రారంభం సందర్భంగా డ్రోన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లాలో రెండవ దశ రీ సర్వే పనుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. రీ సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈసారి పులివెందులలో జగన్‌కు లక్ష మెజారిటీ వస్తుందని కుప్పంలో కూడా వైసిపి గెలుస్తుందని అన్నారు. చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే వైసీపీని 2024లో కూడా ప్రజలు గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టిడిపి నాయకుల పాదయాత్రతో ఉపయోగముండదన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే పట్టణంలో 3వ వార్డు, ఆరవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీలక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, వైసీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సాయి గీత, చెరువు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై చెన్నకేశవుడు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



సూర్య,చంద్ర ప్రభ వాహానంపై చెన్నకేశవుడు

పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం, సాయంత్రం చెన్నకేశవుడు సూర్య, చంద్రప్రభవాహనాలపై ఊరేగాడు. చెన్నకేశవుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనం కల్పించారు. సూర్యప్రభ వాహనానికి ఉభయదాతలుగా గుద్దిటి నారాయణప్ప, బండ్లపల్లి వెంకటజయప్రకాశ్, అంబటిసతీశ్ కుమార్, కట్టాబాగ్యమ్మ మరియు కుమారులు, అన్నంలక్ష్మీనారాయణ, మల్లికార్జున, నీలయ్యగారి పణికుమార్,షర్మిల, జింకాచిన్నకంబయ్య కోటంక్రిష్ణమూర్తి, కోటం రవీంద్రనాథ్, బాబు కుటుంబసభ్యులు వ్యవహరించారు. చంద్రప్రభవాహనానికి ఉభయదాతలుగా వెంకటేశ్వరప్రసాద్, గోపాలక్రిష్ణయ్య కుమారులు వ్యవహరించారు. శనివారం ఉదయం సర్వభూపాల వాహనం, సింహవాహనాలలో స్వామివారిని ఊరేగిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రమణ్యం, ఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పొరాళ్లపద్మావతి, సత్రశాల సత్యనారాయణ, జగ్గాజయలక్ష్మీ, దాడితోట సునీత, సౌందర్యలహరి, గిర్రాజు మహాలక్ష్మీ, అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని బీడుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలను శ్రీ వాణి బ్లోసమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకురాలు శ్రీవాణి తెలిపారు. తొలుత పుట్టపర్తి లోని చిత్రావతి రోడ్డు నందు గల ప్రాథమిక పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు, బీడుపల్లి ప్రాథమిక పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలతోపాటు స్వీట్లు, పళ్ళ రసాలు, చాక్లెట్లు, అరటి పండ్లు, సత్యసాయి ఫోటో, విభూది, అందజేశారు. ఈ కార్యక్రమంలో లలిత జవహర్‌లాల్, శ్రీవాణి శ్రీనివాస ప్రసాద్ ,అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

30న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 30పఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికల్ స్టోర్ సుబ్రహ్మణ్యం తెలిపారు ఇక్కడ కంటి పరీక్షకు వచ్చిన వారిని వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేసి వారికి బెంగళూరులోనే శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తారన్నారు. పరీక్షకు వచ్చేవారు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోటో, మొబైల్ ఫోన్ తీసుకొని రావాలన్నారు.

బాగేపల్లి న్యూస్...

జోరుగా సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి

బాగేపల్లి తాలుక మిట్టేమిరి హెూబ్లీ కానుగమాకులపల్లి పంచాయతీ పరిధలోని 13 గ్రామాలలో సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ ప్రచారం జోరందుకుంది. అభ్యర్థి గ్రామాల్లోకి వెల్లగానే ప్రజలు అభ్యర్థికి పూలమాలలు వేసి స్వాగతం పలుకుతున్నారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని అన్నారు. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరు సిపిఎం గెలవాలని కోరుకుంటున్నారని అన్నారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు కార్యకర్తలు, జెడిఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.